# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
16+4
శనివారం 26 మే 2018


క్యాంపస్ కబుర్లు

ఎంఫార్మసీ విద్యార్థులకు..

## 90శాతం ఉద్యోగావకాశాలు

● జేఎన్టీయూకే ఫార్మసీ విభాగ ప్రోగ్రాం డైరెక్టర్ ఎస్వీయూ ఎం.ప్రసాద్



జేఎన్టీయూకే, మే 25: ఎంఫార్మసీ పీజీ చేసిన విద్యార్థులకు 90శాతం ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని జేఎన్టీయూకే ఫార్మసీ కోర్సుల ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఎస్వీయూఎం ప్రసాద్ తెలిపారు. వర్సిటీ పరిధిలోని 8 జిల్లాల్లో 34ఫార్మసీ కళాశాలలున్నాయని, ఏపీ ఎంసెట్‌లో ర్యాంకు సాధించి అర్హత పొందిన ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ పాసైన విద్యార్థులు బీఫార్మసీలో చేరేందుకు అర్హులని ఆయన చెప్పారు. ఈ కోర్సుకు సంబంధించి పలువిషయాలు ఆయన మాటల్లో..

● ఎంఫార్మసీ పీజీ కోర్సుల్లో ఒక్కో కళాశాలలోనూ 40 సీట్లు ఉంటాయి. వాటిలో 20 సీట్లను ఎంపీసీ విభాగానికి చెందిన విద్యార్థులతో, 20 సీట్లను బైపీసీ విభాగానికి చెందిన విద్యార్థులతో భర్తీచేస్తాం. ఫార్మసీ కళాశాలలన్నింటికీ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తప్పనిసరిగా ఉంటుంది. ఏపీ ఎంసెట్ ద్వారా ఆరేళ్ల వ్యవధిగల ఫార్మాడీ కోర్సును కూడా వర్సిటీలోని ఫార్మసీ విభాగ ప్రోగ్రాం డైరెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. ఈ కోర్సుకు కూడా క్లినికల్ ఫార్మసీరంగంలో మంచిడిమాండ్ ఉంది.

● ఎంఫార్మసీలో మూడు పీజీ కోర్సులుంటాయి 1.ఫార్మస్యూటికల్ అనాలసిస్ అండ్ క్వాలిటీ అష్యూరెన్స్ 2.ఫార్మస్యూటిక్స్ 3.ఫార్మకాలజీ

ఈ మూడుకోర్సుల్లో ఒక్కోదాంట్లో 15సీట్లు ఉంటాయి. వీటిని జీప్యాట్, ఏపీపీజీఈసెట్‌లో విద్యార్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా సీట్లను భర్తీచేస్తారు. జీప్యాట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.

● బీఫార్మసీ పూర్తిచేసిన విద్యార్థులకు సంబంధిత రంగాల్లో 50శాతం మందికి ఉద్యోగాలు లభిస్తాయి. కానీ ఎంఫార్మసీ విద్యార్థులకు ఫార్మా రంగంలోను, బోధనారంగంలోను, పరిశోధనారంగంలోను ఎక్కువశాతం ఉద్యోగాలు లభిస్తాయి. ఈ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు డ్రగ్ఇన్‌స్పెక్టర్లుగా, కెమికల్ ఇంజనీర్లుగా, డ్రగ్ రెగ్యులేటరీ అథారిటీల్లో ప్రభుత్వ సర్వీసుకు సంబంధించిన ఉద్యోగాలు సాధించవచ్చు. పరిశ్రమల్లో, అబ్రాడ్‌వంటి దేశాల్లో ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు చాలాఎక్కువగా లభిస్తాయి.




జేఎన్టీయూకేలోని ఫార్మసీ విభాగ భవనం

## 'లింకన్'తో జేఎన్టీయూకే అవగాహన ఒప్పందం

జేఎన్టీయూకే, మే 25: కాకినాడ జేఎన్టీయూ మలేషియాకు చెందిన లింకన్ విశ్వవిద్యాలయ కళాశాలతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు జేఎన్టీయూకే పీఆర్వో ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు తెలిపారు. దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాలను మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, యువజనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణరావు సమక్షంలో జేఎన్టీయూకే ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు సమక్షంలో లింకన్ విశ్వవిద్యాలయ కళాశాల వీసీ డాక్టర్ అమియాభామిక్ జేఎన్టీయూకే రిజిస్ట్రార్ సుబ్బారావు ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈసందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఇంజనీరింగ్ సాంకేతిక రంగంలో విజ్ఞానం, నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు లింకన్ యూనీ యూనివర్సిటీ జేఎన్టీయూకేకు సహకరించడం అభినందనీయమన్నారు. సమాచార మార్పిడి, డేటా, వనరుల వినియోగం, పరిశోధనలు, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్‌ప్రోగ్రామ్‌ల నిర్వహణల ద్వారా విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవచ్చని తెలిపారు. అనంతరం ఇన్‌చార్జ్ వీసీ రామకృష్ణారావు మాట్లాడుతూ ఏపీని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా ఇరు యూనివర్సిటీలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. సంయుక్తంగా పీహెచ్‌డీ ప్రోగ్రామ్ నిర్వహించేలా పోస్టుడాక్టోరల్ ఫెలోస్ రీసెర్చ్ వర్క్ చేసుకునేలా యూజీ, పీజీ కోర్సుల్లో ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించేలా విధివిధానాలు రూపొందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ఎఫ్‌యూఏఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న డాక్టర్ అమియా భామిక్ జేఎన్టీయూకే రిజిస్ట్రార్ సుబ్బారావు